క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కై కలూరు: నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు నిమిత్తం పల్లెవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ, వాణిజ్య, పరిశ్రమ, ఆక్వా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

30 లోపు ఈకేవైసీ చేయించుకోవాలి

పమిడిముక్కల: ఉపాధి హామీ కార్మికులు ఈ నెల 30వ తేదీ లోపు ఆధార్ కార్డులను జాబ్ కార్డులతో లింక్ చేసుకోవాలని ఎంపీడీఓ సీతా రామరాజు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నకిలీ హాజరు సమస్యకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసిన వారికే అక్టోబర్ 1 నుంచి పని కల్పించడంతో పాటు కూలీ డబ్బులు చెల్లిస్తామని పేర్కొన్నారు. మండలంలో 17,963 జాబ్ కార్డులకుగాను 9,462 కార్డులు ఈకేవైసీ చేయడం జరిగిందన్నారు. ఈకేవైసీ ప్రక్రియ పూర్తి కాకుంటే డబ్బులు పడవని, వెంటనే చేయించుకోవాలని ఉపాధి కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథక ఏపీఓ లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

వెండి వస్తువులు బహూకరణ



బల్లిపర్రు(పామర్రు): గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వేణుగోపాల స్వామివారి దేవస్థానానికి విజయవాడకు చెందిన జాస్తి నాగేశ్వరరావు, కామాక్షి దంపతులు వెండి తీర్థపు గిన్నె, ఉద్ధరిణీ, కుంకుమ గిన్నెలను సమర్పించారు. గురువారం దాతలు ఆలయ ఈఓ కేవీవీవీ ప్రసాదరావును కలిసి సుమారు 194 గ్రాములు గల రూ.24,700ల విలువైన వెండి వస్తువులను అందజేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

4న బహిరంగ వేలం

గుడివాడరూరల్: మండలంలోని మోటూరు గ్రామంలో ఉన్న ఎనిమిది పంచాయతీ చెరువులకు వచ్చేనెల నాలుగో తేదీన బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి జనార్ధనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల పాటు చేపల సాగు చేసుకునేందుకు చెరువులకు వేలం పాటను అక్టోబర్ 4వ తేది శనివారం ఉదయం 11గంటలకు పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఒక్కొక్క చెరువుకు రూ. 20వేలు ముందస్తు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు.

మూలలంకలో వైద్య శిబిరం



కలిదిండి(కై కలూరు): వ్యాధులను ఆదిలోనే గుర్తించి చికిత్స తీసుకోవడం ఉత్తమమని మూలలంక పీహెచ్‌సీ డాక్టర్ నస్రీన్ పేర్కొన్నారు. స్వస్థ నారీ – స్వశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా గురువారం మూలలంక పీహెచ్‌సీలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కైకలూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు ఆరోగ్య విషయంలో అందుబాటులో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను వివరించారు. అనంతరం 354 మందికి బీపీ, షుగర్, నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో విజయబాబు, రవీంద్ర, తుల సీరావు, బాలు, ఏడుకొండలు, దుర్గాప్రసాద్, గణపతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బిల్ కలెక్టర్ మృతి

వెంట్రప్రగడ (పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ పంచాయతీలో బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్న మూడే శ్రీనివాసరావు(49) బుధవారం అర్ధరాత్రి మృతిచెందారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మండలంలోని యలమర్రు, వెంట్రప్రగడలో కొన్నేళ్లుగా బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్న ఆయనకు పంచాయతీ సిబ్బంది సంతాపం తెలిపారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

కోసూరు(మొవ్వ): మొవ్వ మండలం కోసూరు, కాజ గ్రామాల్లో పేకాట (కోత ముక్క) శిబిరాలపై కూచిపూడి ఎస్ఐ కేఎస్ విశ్వనాథ్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి జూదరులను అదుపులోకి తీసుకున్నారు. కూచిపూడి ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. కోసూరులో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 6,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అలాగే కాజ గ్రామంలో కోత ముక్క ఆడుతున్న నాలుగురు వ్యక్తులను డ్రోన్ సహాయంతో పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 520ల నగదుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశారు.



గుడివాడలో శ్రీకాత్యాయనీదేవిగా అమ్మవారు



పామర్రులో సంతానలక్ష్మీగా కన్యకాపరమేశ్వరీ



కాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చిన పామర్రులోని అంకమ్మ తల్లి



వేమవరంలో కాత్యాయనీ దేవిగా కొండలమ్మ



విశేషాలంకరణలో అమ్మవారు



ముదినేపల్లిలో అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ

కాత్యాయనీ.. జ్ఞాన ప్రదాయినీ

- కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు
- ప్రత్యేక పూజలందుకున్న అమ్మవార్లు

గుడివాడ టౌన్: శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు పట్టణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక గౌరీ శంకర్‌పురంలోని గౌరీశంకరస్వామి ఆలయంలో అమ్మవారిని శ్రీకాత్యాయనీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కన్యకాపరమేశ్వరి అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా, వెంకటేశ్వరస్వామి ఆలయంలో విజయలక్ష్మి దేవిగా, వేణుగోపాలస్వామి, భీమేశ్వరస్వామి ఆలయాల్లో గజలక్ష్మి దేవిగా, లీలామహల్ రోడ్డులోని శ్రీవిజయ దుర్గమ్మ వారు గాయత్రీదేవిగా, ప్రణవశ్రమంలో గాయత్రీ మాత అలంకరణలో అమ్మవార్లు పూజలందుకున్నారు.

వైభవంగా ఛండీ హోమం

పామర్రు: స్థానిక శ్రీవల్మీకేశ్వరీ అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రుల్లో భాగంగా గురువారం కుంకుమాభిషేకాలు, ఛండీ హోమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీసూక్త సహిత ఛండీ హోమాన్ని వేద మంత్రాలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

సంతానలక్ష్మీగా అలంకారం

పామర్రు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో గురువారం అమ్మవారిని సంతానలక్ష్మీగా అలంకరించి పూజలు చేశారు. ఆలయంలో అమ్మవారికి విశేషంగా కుంకుమ పూజలను నిర్వహించారు. విజయవాడ రోడ్డులో ఉన్న బుచ్చమ్మ ఆశ్రమంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో పర్వతవర్ధనీదేవి సంతానలక్ష్మీగా దర్శనమిచ్చారు. అలాగే సోమేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీదేవి అన్నపూర్ణాదేవిగా పూజలందుకున్నారు. అంకమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని కాత్యాయని దేవిగా అలంకరించారు. మండలంలోని కొండిపర్రు గ్రామంలోని భ్రమరాంబ దేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ తల్లితోపాటు కౌతవరం గంగా పార్వతీ సమేత గౌతమేశ్వరాలయంలో అమ్మవారు, అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరంలో కాత్యాయినీదేవిగా, డోకిపర్రు భూసమేత వెంకటేశ్వరుని ఆలయంలో గజలక్ష్మీదేవిగానూ గురువారం అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. విశేషాభిషేకాలను అందుకున్న అమ్మవార్లను భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.


మండవల్లి: మండలంలోని పలు ఆలయాల్లో గురువారం అమ్మవారు కాత్యాయనీదేవిగా దర్శనమిచ్చారు. స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని దేవపూడి విజయదుర్గాంబ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవీగా అలంకరించారు. అలాగే వడాలి శ్రీఆంజనేయస్వామి, పెయ్యేరు, బొమ్మినంపాడు కనకదుర్గమ్మ ఆలయాలు, గురజ, పెదకామనపూడి రామలింగేశ్వరస్వామి ఆలయాలు, నారాయణపురం అంకమ్మ ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

కైకలూరు: కైకలూరు శ్యామలాంబ తల్లి, కన్యకా పరమేశ్వరి, లోకుమూడి దత్తాశ్రమంలో అమ్మవార్లు ధాన్యలక్ష్మీ దేవీ అలంకరణలో గురువారం దర్శనమిచ్చారు. శ్యామలాంబ ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాట ప్రదర్శన, హరికథగానం, కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కైకలూరు వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో దసరా పూజలు చేశారు. కైకలూరు షిర్డీ సాయిబాబా దశావతార మహోత్సవాల్లో భాగంగా బాబా నరసింహావతారంలో దర్శనమిచ్చారు. ఆటపాక, గోనెపాడు గ్రామాల్లో కనకదుర్గామాతను కాత్యాయని దేవీగా అలరించారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆటపాక గ్రామంలో...



పడమటిపాలెంలో కాత్యాయనీదేవీ అలంకరణ

గంగానమ్మ గుడిలో నవరాత్రులు

కలిదిండి(కైకలూరు): కలిదిండి మండలం పడమటిపాలెం గంగానమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన పందిరిలో అమ్మవారు కాత్యాయనిదేవి అవతారంలో భక్తులకు దర్శినమిచ్చారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరంలో వేంచేసి ఉన్న శ్రీకొండలమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గుడ్లవల్లేరు విఘ్నేశ్వర ఆర్కెస్ట్రా, కవిపురం, వడ్లమన్నాడు భక్త సమాజం వారిచే భజన, గుడివాడ న్యూనైట్ ఎడ్యుకేషనల్ సొసైటీ వారి అంధ కళాకారుల భక్తి సంగీత విభావరి, విజయవాడ శ్రీనివాస నాట్యమండలి వారి శిలీలలు(మోహిని విజయం) అనే పౌరాణిక నాటకాన్ని కళాకారులు ప్రదర్శించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు ఈ ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు.



శివలీలలు నాటక ప్రదర్శన

ఘనంగా ఫార్మసిస్ట్ దినోత్సవం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గుడివాడ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.జయలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. ఫార్మసిస్టు కేవలం మందులు ఇచ్చే వారు మాత్రమే కాదని ప్రజల ఆరోగ్య సంరక్షణలో కీలక సలహాదారులని పేర్కొన్నారు. సమాజానికి ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ప్రతి ఫార్మసిస్టు బాధ్యత అని అన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు గుడ్లవల్లేరులో ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కలిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు లోగో డిజైనింగ్, స్లోగన్ మేకింగ్‌పై పోటీలు నిర్వహించి గెలిచిన వారికి నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మణరావు, ఐపీఏ లోకల్ బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.రవిశ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్‌లో పలువురు ఫార్మసీ అధ్యాపకులను లయన్స్ ప్రతినిధులు సన్మానించారు. లయన్స్ చైర్మన్ పెరుమాళ్ల, సభ్యులు వైపీసీ ప్రసాద్, అట్లూరి దిలీప్, నవాబు, పరంధామయ్య, చిట్టిబాబు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో విజేతలకు నగదు బహుమతులు అందిస్తున్న డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ జయలక్ష్మి

ముదినేపల్లి రూరల్: స్థానిక విజయ్ ఫార్మసీ కళాశాలలో ఫార్మాసిస్టుల దినోత్సవం గురువారం నిర్వహించారు. నరసరావుపేట ఫార్మాసీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ గౌరి కోదండరాం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫార్మాసిస్టులు రోగులకు, మందులకు వారధిలా పనిచేయాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ సరోజ, ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు విశేష పూజలు

పామర్రు: స్థానిక సాయినగర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆశ్వీజమాసం తొలి గురువారం సందర్భంగా బాబాకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేషంగా పువ్వులతో పూజలు చేసిన అనంతరం మధ్యాహ్న హారతి ఇచ్చారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తమ్మా వినోద్, ఆలయ కమిటీ సభ్యులు బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, సాంబశివరావు, శేషురెడ్డి, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద ఉన్న షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం అన్నసమారాధన చేశారు. తొలుత బాబాకు విశేష పూజలు నిర్వహించారు.



సంప్రదాయాలను ప్రోత్సహించడం అభినందనీయం

చిట్టూర్పు(ఘంటసాల): సంస్కృతీ, సంప్రదాయాలను ప్రోత్సహించేలా తాళం భజన పోటీలు నిర్వహించడం అభినందనీయమని చల్లపల్లి ఉప సర్పంచ్ ముమ్మనేని రాజ్ కుమార్ అన్నారు. ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో కృష్ణా, ఎన్టీఆర్, నెల్లూరు జిల్లాల స్థాయిలో ఉత్సాహంగా సాగుతున్న తాళం భజన పోటీలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్‌లు మాట్లాడుతూ.. తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలు చాటి చెప్పే విధంగా పోటీలు నిర్వహిస్తున్న ప్రసాద్‌ను అభినందించారు. కొడాలి పీఏసీఎస్ చైర్మన్ గుతికొండ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తాళం భజన పోటీల్లో శ్రీ సీతారామాంజనేయ భజన సమాజం, శ్రీ కాళికృష్ణ భజన సమాజం, హిందూ ధర్మ భజన సమాజం, శ్రీ గోకర్ణేశ్వర సమేత గోకర్ణేశ్వర స్వామి భజన సమాజం వారు పాల్గొని భక్తి గీతాలు ఆలపిస్తూ తాళం భజన నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా పడుగు ప్రభాకర్, పి.శ్రీనివాసరావులు వ్యవహరించారు. కార్యక్రమంలో దాసరి సతీష్, యలవర్తి వంశీ, వేములపల్లి సుధీర్, పరుచూరి వెంకటేశ్వరరావు, వాకా రాకేష్, గుత్తికొండ శ్రీనివాసరావు, దోనేపూడి బుజ్జి పాల్గొన్నారు.



తాళం భజన పోటీలను పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, నిర్వాహకులు

మహిళల భద్రత.. సామాజిక బాధ్యత

బంటుమిల్లి: మహిళల సమస్యలు సామాజిక సమస్యలుగా ప్రతి ఒక్కరూ గ్రహించి వారికి రక్షణ కల్పించాలని ఎస్ఐ గణేష్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గురువారం మహిళల భద్రత.. సామాజిక బాధ్యత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ప్రిన్స్‌పాల్ డాక్టరు ఎస్.జగన్‌మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థినులు, మహిళలకు రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. సదస్సులో వైస్ ప్రిన్స్‌పాల్ బీడీ జయరాజు, ఎన్ఎస్ఎస్, ఐక్యూ కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ గణేష్‌కుమార్

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకి నివాళి

ముదినేపల్లి రూరల్: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మీసాల సత్యనారాయణ, కొలిపర నాగరాజు, వొత్తుమిల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

వర్షంతో రహదారులు అస్తవ్యస్తం



మండవల్లి: మండవల్లిలో వర్షం కారణంగా రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. స్థానిక కైకలూరు వీధిలో రహదారిపై వర్షం నీరు నిలిచి వాహనదారులు, ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. శ్మశానానికి కూడా ఇదే రహదారి వైపు నుంచే వెళ్తుంటారు. దీంతో మరిన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారి వద్ద రోడ్డుపై గుంత ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో పడి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దాడిపై పరస్పర ఫిర్యాదులు

ముదినేపల్లి రూరల్: పాత గొడవల నేపథ్యంలో తమపై దాడి చేసి గాయపరిచారంటూ ఇద్దరు మహిళలు గురువారం పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల కథనం మేరకు.. ముదినేపల్లికి చెందిన కె.రామలక్ష్మి కూరగాయల కొట్టు వద్ద ఉండగా ఎ.మహేష్, శిరీష, జ్యోతి తనపై దాడి చేశారని ఫిర్యాదు చేసింది. అదేవిధంగా ముదినేపల్లికి చెందిన ఎ.జయనాగవెంకట శిరీషపై ఎ.సుబ్బారావు, రామలక్ష్మి, వెంకటలక్ష్మి దాడి చేశారని బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఇద్దరు మహిళల పరస్పర ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గుర్విందగుంట(పెదపారుపూడి): పోషక విలువ కలిగిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన జీవితం పొందవచ్చని పెదపారుపూడి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్ వైజర్ అరుణ కుమారి పేర్కొన్నారు. మండలంలోని గుర్విందగుంట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార మాసోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఎక్కువుగా ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. బయట దొరికే జంక్ ఫుడ్ తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆత్మజ్ఞాన బోధన

గుడివాడ టౌన్: విశ్వ విజ్ఞాన్ స్కూల్ దగ్గర ఉన్న అంబేడ్కర్ భవనంలో విద్యార్థులకు ధ్యాన శిక్షణలో భాగంగా గురువారం ఆధ్యాత్మిక గురువు రాజకుమారి ఆధ్యాత్మిక బోధ చేశారు. సప్తాహంలో భాగంగా ఆదిత్య కాలేజీ విద్యార్థులకు రాజకుమారి ఆత్మజ్ఞాన బోధ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో అధ్యాపకులు వాణి, ఉమ, పద్మ, విమల, జయరాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్నార్ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

గుడివాడ టౌన్: విద్యతో పాటు ప్రయోగాత్మక అవగాహన కూడా విద్యార్థులకు అవసరమని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ అన్నారు. గురువారం కళాశాల ఎంబీఏ విద్యార్థులు సింగరాయిపాలెం గ్రామంలోని గ్రోవెల్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల నిర్వహణలో ప్రత్యక్ష పరిజ్ఞానం సంపాదించడం వల్ల విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యం పెరుగుతుందని తెలిపారు. గ్రోవెల్ ఫీడ్స్ హెచ్ఆర్ మేనేజర్ చౌదరి తమ కర్మాగారం ఉత్పత్తుల అమ్మకం, ఫ్యాక్టరీ నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంబీఏ హెచ్ఓడీ ఎంబీ సువర్చల, అధ్యాపకులు వి.నాగేంద్రకుమార్, ఎం.భరత్‌కుమార్ పాల్గొన్నారు.



ఫ్యాక్టరీ సందర్శించిన ఏఎన్నార్ కళాశాల విద్యార్థులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



గుడివాడలో చెత్తను తొలగిస్తున్న ఆర్డీఓ, మున్సిపల్ సిబ్బంది




గుడ్లవల్లేరులో మొక్కలు నాటుతున్న సంపత్‌కుమారి

గుడివాడ టౌన్: పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటేనే మనిషి ఆరోగ్యంగా ఉంటాడని తద్వారా సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందని ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్‌తో కలిసి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయ పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తొలుత ప్రభుత్వ కార్యాలయాలు శుభ్రపరిచి అనంతరం ప్రజలను ఇటుగా ఆలోచింపజేయాలని సూచించారు. ఒకరోజు – ఒక గంట – ఒకసారి' అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

గుడ్లవల్లేరు: మొక్కలు నాటడంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని గుడివాడ డివిజన్ పంచాయతీ అధికారి జి.సంపత్ కుమారి అన్నారు. గురువారం స్వచ్ఛతాహీ సేవలో భాగంగా శ్రమదానం, మొక్కలు నాటడం చేపట్టారు. ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్, డెప్యూటీ ఎంపీడీఓ అంజనా దేవి, గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండ రామారావు, కాలేజీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సాగునీటి డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, లయన్స్ చైర్మన్ పెరుమాళ్లు, లయన్స్ ప్రతినిధులు, సచివాలయ, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాలకృష్ణ అధికారిక సైకో



కైకలూరు: సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకే అధికారికంగా సైకో సర్టిఫికెట్ ఉందని వైఎస్సార్ సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి బీవీ రావు ఎద్దేవా చేశారు. కై కలూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై సభ్యసమాజం తలదించుకునే భాషను వాడారని మండిపడ్డారు. గతంలో నిర్మాత బెల్లంకొండ సురేష్‌పై కాల్పులు జరిపి వైద్యుల దగ్గర మానసిక పరిస్థితి బాగోలేదని సర్టిఫికెట్ తెచ్చుకోవడం నిజం కాదా? అని ప్రశ్నించారు. ప్రజా నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అవాకులు చవాకులు పేలితే సహించమని హెచ్చరించారు.